క్లుప్తంగా

పీఎం కిసాన్ వివరాల తనిఖీ

ఇందుకూరుపేట : పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను ఏడీ మారుతీదేవి సోమవారం తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో మండలంలోని జగదేవిపేట, కొమరిక, గంగపట్నం, కొరుటూరు తదితర గ్రామాల్లో ఆమె లబ్ధిదారుల ఆధార్, పాస్ బుక్, బ్యాంకు ఖాతా తదితర వివరాలను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పక్కాగా 'ఆడుదాం ఆంధ్ర'

కోవూరు : మండల పరిధిలో డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను పటిష్టంగా నిర్వహించేలా ఫిజికల్ డైరెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధిలోని పీడీలు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం వారీగా పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రహీమ్, వై.చెంచులక్ష్మమ్మ ఉన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని వవ్వేరు కో–ఆపరేటివ్ రూరల్ సొసైటీ లిమిటెడ్ కార్యాలయంలో 70వ సహకార వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదట కార్యాలయంలో సహకార పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు క్రాప్‌లోన్ ఇవ్వడంతో పాటు ఎకరాకు రూ.4 వేల ఎరువుల కొనుగోలుకు లోన్ అందిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు మేనకూరు సీతారాంరెడ్డి, జిల్లా సహకార ఆడిటర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నెలపాటు భక్తులకు అన్నప్రసాదం



ముత్తుకూరు : బ్రహ్మదేవిలోని శ్రీకైలాస నాథేశ్వరాలయంలో పూజలు ఆచరిస్తున్న అయ్యప్ప స్వామి భక్తులకు నెలరోజుల పాటు అన్నప్రసాద వితరణ చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి నిర్ణయించారు. మధ్యాహ్నం పూట మాత్రమే జరిగే భిక్ష(అన్నప్రసాదం) కార్యక్రమాన్ని సోమవారం వారు ప్రారంభించారు. అయ్యప్పభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేదీప్యం.. లక్ష దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా లక్ష దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ముందుగా వేద పండితుల మంత్రోచ్చారణలతో లక్ష దీపోత్సవ జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, నవావరణ పూజలు జరిగాయి. రాత్రి నంది వాహనంపై మల్లికార్జున సమేత కామాక్షితాయి దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ, ఉభయదాతలు హేమంత్‌రెడ్డి, సింధు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆలిండియా ఓపెన్ చెస్ విజేత ఇమ్రాన్

- ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయవాడ వాసులు



బహుమతులు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

కోవూరు : స్థానిక గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. మొత్తం ఏడు రౌండ్ల పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయవాడకు చెందిన ఫీడే మాస్టర్ (ఎఫ్‌ఎం టైటిల్ హోల్డర్) మహమ్మద్ ఇమ్రాన్, ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ రవితేజ నిలువగా తృతీయ స్థానంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ కుషాగ్ర మోహన్ నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు, కప్, ప్రశంసా పత్రాలు అందజేశారు. మంచి ప్రతిభ ప్రదర్శించిన జిల్లాకు చెందిన హేమల్ వర్షల్‌కు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కుందనపు టెక్నాలజీస్ చైర్మన్, ప్రముఖ సంఘ సంస్కర్త పద్మనాభన్ మహేశ్ మాట్లాడుతూ ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, టోర్నీ నిర్వాహకులు వెంకటేశ్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీడీ ఆశోక్ పాల్గొనారు.

విద్యుత్ మోటార్ల చోరీ

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న రెండు విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. తిక్కవరప్పాడుకు చెందిన కందిమళ్ల చంద్రమోహన్‌నాయుడు ఎప్పటిలానే తన పొలానికి సోమవారం వెళ్లిగా, విద్యుత్ వైర్లు కత్తిరించి, పైపులు కట్‌చేసి విద్యుత్ మోటారు చోరీ చేసినట్లు గుర్తించారు. వీటి విలువ రూ.30 వేలు ఉంటుందని రైతు వాపోయాడు. అలాగే అదే ప్రాంతంలో నోసిన రంగయ్యతో పాటుగా మరో ముగ్గురికి చెందిన రూ.35 వేల విలువైన విద్యుత్ మోటారు చోరీకి గురైంది. ప్రతి సంవత్సరం విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ విద్యార్థినులు మేడిబోయిన భావన, గోళ్ల ప్రతిమలకు వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విద్యా ప్రభాకర్ ఆధ్వర్యంలో మేడిబోయిన భావన స్క్రీనింగ్ అండ్ స్ట్రక్చరల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ యాంటీ క్వారమ్ సెన్సింగ్ సిగ్నల్ మొలెక్యుల్ ఐసోలేటెడ్ ఫ్రమ్ మైరిస్టిక్ ఫ్రాగ్రన్స్ అనే పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. అలాగే గోళ్ల ప్రతిమ కూడా డాక్టర్ కె.విద్యా ప్రభాకర్ ఆధ్వర్యంలోనే ప్యూరిఫికేషన్ అండ్ బయో కెమికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ యాంటీ క్వారమ్ సెన్సింగ్ సిగ్నల్ మొలెక్యుల్ ఐసోలేటెడ్ ఫ్రమ్ ఎడిబుల్ మష్రూమ్స్ అనే పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. దీంతో వీరిద్దరికి వీసీ జీఎం సుందరవల్లి డాక్టరేట్ ప్రదానం చేసి అభినందించారు.

మనుబోలుకు సాగునీరు విడుదల



నీటి విడుదలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు మనుబోలు మండలానికి కండలేరు లో–లెవల్ స్లూయిజ్ నుంచి సాగునీరు విడుదల చేశారు. ముందుగా చెప్పిన ప్రకారం సోమవారం 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రైతులు అవసరాల మేరకు విడతల వారీగా మొత్తం 2 టీఎంసీలు విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగగంగ డ్యామ్ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి, ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, డీఈ విజయ్‌రామిరెడ్డి, ఏఈ గోపీకృష్ణ, సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజు, ఇరిగేషన్ ఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి, డీఈ విజయ్ భాస్కర్‌రెడ్డి, ఏఈ వేమారెడ్డి, పాల్గొన్నారు.

నీటి విడుదల హర్షణీయం

రైతులు కోరిన వెంటనే మంత్రి కాకాణి ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు సాగునీరు విడుదల చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. అడిగిన వెంటనే నీటి విడుదలకు చొరవ చూపిన మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీంధర్‌రెడ్డి, శానంపూడి సురేందర్‌రెడ్డి, ఉగ్గుమూడి శశికుమార్‌రెడ్డి ఉన్నారు.

రైతాంగం సుభిక్షంగా ఉండాలి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఆకాశదీపం వెలిగించిన దంపతులు



మంత్రి కాకాణి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, రాష్ట్రంలో రైతాంగం సుభిక్షంగా ఉండాలని పార్వతీ పరమేశ్వరులను కోరుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. ఆలయ అర్చకులు, కార్యనిర్వహణ అధికారి జనార్ధనరెడ్డి తదితరులు కాకాణి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేసి, వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని పరమశివుడిని వేడుకున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు చెప్పారు. సిద్దేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. పార్టీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, ఆలయ చైర్మన్ పెదపాళెం సుబ్బయ్య, ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, పార్టీ నేత లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

కులగణన చారిత్రక ఘట్టం

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



కొడవలూరు : మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు : రాష్ట్రంలో చేపట్టనున్న కులగణన చారిత్రక ఘట్టమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అభివర్ణించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కులగణనపై వలంటీర్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో ఆయన హాజరై, మాట్లాడారు. కులగణన వల్ల జనాభా ప్రాతిపదికన పథకాలను అందించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు మరింత చేరువ చేసే ఉద్దేశంతోనే ఈ బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కులగణనను పారదర్శకంగా, చిత్తశుద్ధితో చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ గాలి జ్యోతి, డీటీ గున్నం మల్లికార్జున, ఈఓపీఆర్డీ డేవిడ్ పాల్గొన్నారు.

పక్కాగా నిర్వహించాలి

ఇందుకూరుపేట : ఈనెల 27 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు చేపట్టనున్న కులగణనను పక్కాగా నిర్వహించాలని డీఎల్‌డీఓ వసుమతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కులగణనపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులగణనలో కుటుంబంలోని ప్రతిఒక్కరి ఆర్థిక, ఉద్యోగ, సామాజిక వివరాలను పొందు పరచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా చేపట్టాలి

కోవూరు : మండల పరిధిలో నిర్వహించనున్న కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి వారి కులం, ఏ పనులు చేస్తున్నారు తదితర వివరాలను యాప్‌లో నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కులగణనపై శిక్షణ

పొదలకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కులగణనపై శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. తొలిరోజు వావింటపర్తి, ఆర్‌పైపాళెం, మొగళ్లూరు, కనుపర్తి, తోడేరు, బత్తులపల్లి, నేదురుమల్లి సచివాలయ సిబ్బందికి తహసీల్దార్ కె.వీర వసంతరావు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులగణన పకడ్బందీగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ కుల గణనపై మరో రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ నగేష్‌కుమారి తెలిపారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం



విజేతలకు బహుమతులందజేస్తున్న ఐటీడీఏ పీఓ

కొడవలూరు : క్రీడలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ, పేపర్ మేకింగ్‌లోనూ గిరిజన గురుకులాల విద్యార్థులు చూపిన ప్రతిభ ప్రశంసనీయమని ఐటీడీఏ పీఓ రాణి మందా కొనియాడారు. మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకులంలో ఐటీడీఏ పరిధిలోని ఐదు జిల్లాల గిరిజన కులాల విద్యార్థులకు సోమవారం లిటరసీ ఈవెంట్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 42 మంది విద్యార్థులకు పీఓ బహుమతులందజేసి మాట్లాడారు. వైజాగ్‌లో జరిగే జాతీయ పోటీల్లోనూ ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏఎంఓ శాంతకుమారి, గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, కావలి ఏపీటీడబ్ల్యూ బాలబాలికల ప్రిన్సిపల్స్ శ్యామ్‌సుధాకర్, సుజాత, పీడీ వై.సత్యనారాయణలు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవితకు కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ శారద



కొడవలూరు : గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌తో బహుమతులు పొందిన విద్యార్థులు

కొడవలూరు : విద్యార్థులు బంగారు భవిష్యత్తు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. కొడవలూరు హైస్కూల్‌లో సోమవారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేసి ప్రతిఒక్కరూ చదువుకునేలా చర్యలు తీసుకుందన్నారు. అనంతరం లైబ్రేరియన్ కె.రాజేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- యల్లాయపాళెం గ్రంథాలయంలో వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ఎం.మోహన్ రామలింగయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ఎంఈఓ పి.వెంకటరత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఇందులో ఎంఈఓ పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత, అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీధర్, ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

- విడవలూరు : స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ బి.సుజాత ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో లైబ్రేరియన్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ మధు, బాబురావు పాల్గొన్నారు.
- స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం డిజిటల్ లైబ్రేరీ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ నిరూప, డాక్టర్ సురేంద్ర, శ్రీనివాస్, వాణి పాల్గొన్నారు.

పుస్తకాన్ని మించిన నేస్తం లేదు

మనుబోలు : పుస్తకాన్ని మించిన నేస్తం ఉండదని మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డేవిడ్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు దిశ చట్టంపై మహిళా పోలీస్ శ్రావ్య అవగాహన కల్పించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి వాసిలి అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు



విడవలూరు గ్రంథాలయంలో..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇందుకూరుపేట: మండలంలోని టీవీకండ్రిగ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. లేబూరు గిరిజన కాలనీకి చెందిన ఉప్పల మెల్లయ్య (40) ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై కొమరికలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి బంధువులైన చంద్రశేఖర్, రమేష్‌తో కలిసి గంగపట్నం వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తూ మార్గం మధ్యలో టీవీకండ్రిగ వద్ద రోడ్డుపై ఉన్న గేదెను గమనించక ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మెల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రశేఖర్, రమేష్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. ఎస్సై వీరేంద్రబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

జగనన్న పాలనలో అన్నివర్గాలకు ప్రాధాన్యం

- గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



వెంకటాచలం : కనుపూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నేతలు



ముత్తుకూరు : బ్రహ్మదేవిలో..



కోవూరు : ఇనమడుగులో..

వెంకటాచలం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యత నిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జేసీఎస్ మండల కన్వీనర్ మందల వెంకటశేషయ్య అన్నారు. మండలంలోని కనుపూరు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబాన్ని పలకరించి, జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు పాలనలో రుణమాఫీ పేరుతో చేసిన మోసాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వెంకటశేషయ్య విలేకరులతో మాట్లాడుతూ తాను ప్రజలకు మేలు చేశానని నమ్మితేనే ఓటు వేసి మద్దతు తెలపాలన్న ఏకైక సీఎం భారతదేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. ప్రజలను అన్నివిధాలా మోసం చేసిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అన్నివర్గాల ప్రజలు సంతృప్తిపడేలా జగనన్న పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. ప్రజలు గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జనరంజక పాలనకు మధ్య తేడాను గమనించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ పాలనను ఆశీర్వదించండి

ముత్తుకూరు : దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదర్శ పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును మళ్లీ ఆశీర్వదించాలని ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య అన్నారు. బ్రహ్మదేవి సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం సంక్షేమ పథకాలు–లబ్ధిదారుల వివరాల ఫ్లెక్సీని, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, గతంలో ఎవరూ అమలు చేయని సంక్షేమ పథకాలను అందిస్తూ ఇతర రాష్ట్రాలు అనుసరించే పరిస్థితి రావడం గర్వంగా ఉందన్నారు. సర్పంచ్ సుధాకర్, మాజీ సర్పంచ్ కట్టా సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి వాసుదేవరావు, నాయకులు షేక్ జమీల్, షేక్ మస్తాన్, బషీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నే రావాలి

తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు అన్నారు. మండలంలోని ఈదూరు సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ టంగుటూరు పద్మనాభరెడ్డి, సర్పంచ్ టంగుటూరు శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇ.సరస్వతి, పార్టీ నేత ఇ.వేణు పాల్గొన్నారు.

పథకాల అమలును పరిశీలించాలి

పొదలకూరు : గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరును పరిశీలించాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పొదలకూరు మండలం డేగపూడి సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాల వివరాల బోర్డును ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి అందరూ కలిసి పథకాల అమలు తీరుపై చర్చించారు. ప్రతినిత్యం 20 ఇళ్లకు వెళ్లి వారి వివరాలను తెలుసుకుని సంక్షేమ పథకాల అమలు తీరును అడగాలన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్ మండి ఓబుల్‌రెడ్డి, ఎమ్పీటీసీ నోటి వెంకటేశ్వర్లురెడ్డి, సచివాలయ కన్వీనర్లు నోటి రామలింగారెడ్డి, కేత ప్రసాద్, గార్ల వజ్రమ్మ, నాయకులు వెంకట్రామిరెడ్డి, జి.పెంచలయ్య పాల్గొన్నారు.

జగనన్న సీఎం కావాలి

కొడవలూరు : రాష్ట్ర ప్రజలు బాగుండాలంటే జగనన్న మరలా సీఎం కావాలని ఎంపీపీ జి.జ్యోతి అన్నారు. మండలంలోని రేగడిచెలికలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. జగనన్న పాలనలో అన్నివర్గాల వారు సంతోషంగా ఉన్నారన్నారు. సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు మాట్లాడుతూ రేగడిచెలిక గ్రామంలోనే సంక్షేమ పథకాల ద్వారా రూ.18.68 కోట్లు లబ్ధిదారులకు అందినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పి.సరోజనమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, సొసైటీ చైర్మన్ దేవనబోయిన శివకుమార్, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ రాజమ్మ, ఉప సర్పంచ్ కళాకృష్ణ, పార్టీ నేత అక్కుల్‌రెడ్డి, ఈఓపీఆర్డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉంటేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని దామరమడుగు సచివాలయం–2లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరెక్కడా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వినోద్, ప్రదీప్‌కుమార్, నాగేంద్ర, లక్ష్మయ్య, రాజారెడ్డి పాల్గొన్నారు.

పార్లపల్లిలో..

విడవలూరు : మండలంలోని పార్లపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎంపీటీసీ దాసరి శైలజా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని ప్రజలకు దాదాపు రూ.17 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో చేరాయని వివరించారు. పార్టీ నేతలు ఆవుల శ్రీనివాసులు, మల్లికార్జున, మాధవయ్య, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు

కోవూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారని డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. మండలంలోని ఇనమడుగులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం సచివాలయం–3లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ సచివాలయ మండల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పార్టీ నేత వసంతకుమార్‌రెడ్డి పాల్గొన్నారు



తోటపల్లిగూడూరు : ఈదూరు సచివాలయంలో పార్టీ జెండావిష్కరణ



కొడవలూరు : రేగడిచెలికలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దామరమడుగు సచివాలయంలో..



విడవలూరు : పార్లపల్లిలో..